క్లుప్తంగా

డోన్ ఏఓగా బాధ్యతలు


శ్రీనివాసరావు

డోన్: మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్ బాషా ఎమ్మిగనూరు వ్యవసాయ ల్యాబ్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఓకు మండల వ్యవసాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిమెంట్ నగర్ ఉప సర్పంచ్ మమత, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. దోమలు పుట్టకుండా డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలి, జ్వరం వస్తే వైద్యున్ని సంప్రదించాలన్నారు.

చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి పల్లకీపై ఆశీనులు చేసి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాధ్యతల స్వీకరణ


ఏడీ కొండారెడ్డి

సంజామల: స్థానిక పశుసంవర్ధక శాఖ ఏరియా ఆస్పత్రి ఏడీగా డాక్టర్ కొండారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మోహన్‌రావు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆళ్లగడ్డలో పనిచేస్తున్న కొండారెడ్డి సంజామలకు వచ్చారు. పాడిరైతులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలతో పాటు పథకాలు చేరువ చేస్తామన్నారు.

ఆలయ ఏసీగా శ్రీనివాసరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కామేశ్వరమ్మ బదిలీల్లో భాగంగా విజయవాడకు వెళ్లారు. గుంటూరు జిల్లా పొన్నూరులోని భావనారాయణస్వామి ఆలయంలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి నందవరం ఆలయానికి వచ్చారు. ఈయన ప్రస్తుతం మహానంది ఆలయ ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు.

16 నుంచి మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నేతలు

డోన్ టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు వినతి పత్రాలు అందించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 16వ తేదీ నుంచి నిరసన దీక్షలు చేపడుతున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షకార్యదర్శులు అన్వర్, అబ్బాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు గౌస్, అజయ్, చంద్ర, సంజీవుడు పాల్గొన్నారు.

సేవలు దూరం.. రోగులకు భారం

- గత ప్రభుత్వంలో ఇంటింటా ఉచిత వైద్య సేవలు
- పథకాన్ని గాలికొదిలేసిన కూటమి సర్కార్
- ఆస్పత్రుల చుట్టూ తిరగలేక దివ్యాంగులు, వృద్ధుల ఇబ్బందులు



గతంలో రోగుల ఇంటి వద్దనే పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్), విలేజ్ హెల్త్ క్లీనిక్ కార్యక్రమం ద్వారా రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

అవుకు: ప్రస్తుత కాలంలో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. అలాంటి సమయంలో పేదలకు వైద్యం చాలా ప్రధానమని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు వైద్య సేవలను సులభతరం చేశారు. ఆయా గ్రామాల వద్దకే వైద్యులు, వైద్య సిబ్బంది వచ్చి రోగుల ఇంటి వద్దనే పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె ప్రజలకు అందే వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తోంది. ఆస్పత్రులకు రాలేని వారి పరిస్థితిని దయనీయంగా మార్చింది.

గతంలో పేదల ఆరోగ్యానికి రక్ష

పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. ప్రధానంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఇంటి వద్దకే అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులను గ్రామాల్లోని ప్రతి ఇంటికి పంపించి వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని అమలు చేశారు. ప్రతి నెలా తమ పరిధిలోని ఏరియాల్లో నిపుణులైన వైద్యులు, సిబ్బంది వచ్చి 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేసేవారు. అత్యవసర వైద్య సేవల కోసం అవసరమైతే సమీపంలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించేవారు.

నిపుణులతో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిపుణులైన వివిధ విభాగాలకు చెందిన వైద్యులను రప్పించి ఆయా గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు అందే ఉచిత వైద్య సేవలన్నింటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని రోగులు, వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురుస్తుండడంతో పలు వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం, దోమల బెడద అధికమైన నేపథ్యంలో జలుబు, దగ్గు, జ్వరాల వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఆస్పత్రికి రాలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పూర్తిగా పడకేసింది.

గతంలో ఇంటికి వచ్చి వైద్యం చేసేవారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఇంటికి వచ్చి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించేవారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందించేవారు. కొద్ది నెలలుగా ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించిన దాఖలాల్లేవు. పేదల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడు లేడు. మా లాంటి వృద్ధులను దృష్టిలో ఉంచుకుని ఇంటింటా వైద్య సేవలను అందించాలి. –మంచాల వెంగమ్మ, సుంకేసుల, అవుకు

మండలం	ఏరియా ఆస్పత్రి	సీహెచ్‌సీ	పీహెచ్‌సీ గ్రామం
అవుకు	–	1	ఉప్పలపాడు
బనగానపల్లె	1	–	పలుకూరు, టంగుటూరు
కొలిమిగుండ్ల	–	–	కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె
సంజామల	–	–	ఆకుమళ్ల, సంజామల, పేరుసోముల, నొస్సం
కోవెలకుంట్ల	–	1	రేవనూరు

ఇబ్బంది పడుతున్నాం

గతంలో ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేసేవారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేసిన తరువాత అవసరమైతే మందులను ఇచ్చేవారు. ప్రస్తుతం ఇంట్లో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నాం. కనీసం బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేయడంలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన వైద్య సేవలను ఇంటికి వచ్చి అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –సుబ్బులక్ష్మి, అవుకు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న డీసీహెచ్ శ్రీనివాసరావు

డోన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు డీసీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డోన్ వంద పడకల ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు విభాగాలను పరిశీలించి కావాల్సిన పరికరాలు, అవసరమైన యంత్రాలకు ప్రతిపాదనలు పంపాలని సూపరింటెండెంట్ హనీఫ్‌కు సూచించారు. రోగులు, వారి బంధువులపై వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సుఖ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట డాక్టర్లు అనురాధ, రమ్యశిల్ప, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణి ఉన్నారు.

ఆసనాలతో ఆరోగ్యయోగం


యోగాసనాలు వేస్తున్న వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు

కొలిమిగుండ్ల: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఆరోగ్య జీవితం సాధ్యమవుతుందని డోన్ ఆర్డీఓ నర్సింహులు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రముఖ పర్యాటక ప్రదేశం బెలుం గుహల ఆవరణలో 1850 మందితో యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా పర్యాటక శాఖాధికారి సత్యనారాయణ, ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి యశోధ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో యోగా నిర్వహించి భక్తులు, పర్యాటకులను మమేకం చేసి యోగా కార్యక్రమం ద్వారా ఆరోగ్యాన్ని అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రసిద్ధి చెందిన బెలుం గుహల ఆవరణలో యోగాసనాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో దాదాపు 8లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. డోన్ డీఎల్‌డీఓ నరసింహా రెడ్డి, కొలిమిగుండ్ల, అవుకు ఎంపీడీఓలు ప్రసాద రెడ్డి, వెంగన్న, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ


రెడ్డిపల్లెలో వివరాలు సేకరిస్తున్న ఏపీడీ నరసింహారెడ్డి

సంజామల: అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఎన్‌ఆర్‌ఈజీఏ డోన్ డివిజన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి అన్నారు. సంజామల మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో అవినీతి ఆరోపణలపై ఈ నెల 3వ తేదీ సాక్షి దినపత్రికలో ×మస్టర్ల మాయాజాలం×అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఏపీడీ నరసింహారెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. శుక్రవారం రెడ్డిపల్లె గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఉపాధిహామీ పథకంలో అవినీతి ఆరోపణలపై ఆరా తీశారు. గ్రామసభ నిర్వహించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కొండారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీడీ మాట్లాడుతూ.. కూలీల సమస్యలు, విచారణ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలకు పనులు కల్పించడం ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యత అని.. వారికి పూర్తి వేతనం పడేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ సాల్మన్, ఏపీఓ జయంతి, టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు


కూలీలకు అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

డోన్ టౌన్: రక్తదానం చేయడంపై ఎలాంటి సమస్యలు ఉండవని.. వీటిపై అపోహలు అవసరం లేదని ఇండియన్ రెడ్ క్రాస్ డోన్ మండల చైర్మన్ కొచ్చెర్వు వెంకటేశ్వర్లు అన్నారు. జూన్ 14న అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొచ్చెర్వు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రక్తదానంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చని తెలిపారు. ఆపద సమయాల్లో ప్రాణదాతలు అవుతారన్నారు. అనంతరం కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు.


బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బనగానపల్లె: నవాబుల కాలంలో బనగానపల్లెలో నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇక్కడ పనిచేసే అధికారులు, ఉద్యోగులు, క్రయవిక్రయదారులు భయాందోళ చెందుతున్నారు. 1947 ఫిబ్రవరిలో రాష్ట్ర గిడ్డంగి కోసం దీన్ని నిర్మించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భవనాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మార్పు చేశారు. అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. భవనం ముందు భాగంలోని వరండా పూర్తిగా కూలిపోగా భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఐదేళ్ల క్రితం భవనంలోని ఒక గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విలువైన పత్రాలు కాలిపోయాయి. ఈ కార్యాలయం పరిధిలో మొత్తం 54 గ్రామాలు ఉన్నాయి. బనగానపల్లె మండలంలో 33 గ్రామాలు, సంజామల మండల పరిధిలో 14, కొలిమిగుండ్ల 3, ఉయ్యాలవాడ 3, అవుకు ఒక గ్రామం ఉంది. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి లక్షలాది రూపాయాల ఆదాయం లభిస్తోంది. అయితే నూతన భవన నిర్మాణానికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే నూతన భవనం నిర్మించాలని క్రయవిక్రయదారులు, ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్ విజయకుమార్‌ను వివరణ కోరగా చెప్పేందుకు నిరాకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంతో పాటు మండలంలోని యు.కొత్తపల్లె, మల్యాల, దేవరబండ, గుండాల సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్, శ్రీకృష్ణకాలనీ, మహాలక్ష్మీ హాస్పిటల్, పండరీనగర్, కురుకుందకాలనీ, పాతపేట, కొండపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే శ్రీనివాసనగర్, ఆటోనగర్, ఇందిరానగర్, కంబాలపాడు రోడ్డు, నెహ్రూనగర్, సుందర్‌సింగ్‌కాలనీ, పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. యు.కొత్తపల్లె, మల్యాల, దేవరబండ, గుండాల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె రూరల్: స్థానిక పొదుపు భవనంలో ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్, మండలంలోని వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

మున్సిపల్ మాజీ అధికారులకు షోకాజ్ నోటీసులు

డోన్ టౌన్: డోన్ మున్సిపల్ మాజీ కమిషనర్‌తో పాటు మరో ఏడుగురిపై అవినీతి ఆరోపణలు నిర్ధారణ కావడంతో ప్రభుత్వం షోకాజ్ నోటీలు జారీ చేసింది. 2020–21లో నగర పాలక సంస్థలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేసింది. 2024 ఫిబ్రవరి 23న విజిలెన్స్ అధికారుల నివేదిక ప్రకారం అప్పటి కమిషనర్ రమేష్‌బాబు, డీఈ వేణుగోపాల్, ఏఈలు రామ్మూర్తి, రాజునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు షబరీష్, ప్రహ్లాద్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు లక్ష్మీసువర్ణ, రుపేష్ కుమార్‌లు బాధ్యులని ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీని ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరుతూ ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 15 రోజుల్లోగా నోటీసులకు సమాధానం ఇవ్వకుంటే ప్రభుత్వ సర్వీసు రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన సప్పోగుల సాలన్న, మద్దిలేటి, తిమోతి కలిసి పొలం దగ్గర అడ్డగించి చంపుతామని బెదిరించినట్లు అదే గ్రామానికి చెందిన రవికుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు శుక్రవారం రాత్రి తెలిపారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

బేతంచెర్ల: మండలంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవాణి హైస్కూలో అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ అడ్డుకున్నారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ధర్నా చేశారు. అనంతరం ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

సచివాలయాలకు పరుగులు

- తల్లికి వందనం జాబితాలో 600కుపైగా అనర్హులు


సచివాలయంలో జాబితాలో పేర్లు చూసుకుంటున్న ప్రజలు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం కార్యరూపం దాల్చింది. ఈ పథకానికి అర్హులు, అనర్హుల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించారు. శుక్రవారం జాబితాలో తమ పేర్లను చెక్ చేసేందుకు తల్లితండ్రులు పరుగులు పెట్టారు. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రస్తుతం విడుదల చేసిన జాబితా ప్రకారం మండలంలో 7034 మంది అర్హుల జాబితాలో ఉన్నారు. 600కు పైగానే అనర్హులుగా ఉన్నారు. వీరిలో చాలా మందికి పది ఎకరాల కంటే పొలం కలిగి ఉండడం, వాహనాలు, 300 యూనిట్ల వాడకం, రూ.12 వేల మేర వేతనం పొందే వారున్నారని కారణాలు చూపించారు. అయితే ఇందులో కూడా అర్హులు ఉన్నారు. రాఘవరాజుపల్లెకు చెందిన తలారి లక్ష్మికి భర్త పేరుపై అర ఎకరా పొలం ఉంది. కానీ 10 ఎకరాల పొలం ఉన్నట్లు చూపడంతో జాబితాలో పేరు లేకుండా పోయిందని వాపోయారు. చాలా మందికి ఇద్దరు, ముగ్గురు పిల్లలుంటే అందరి పేర్లు చూపలేదు.

మహిళలతో తప్పుగా ప్రవర్తిస్తే చర్యలు


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గౌతమి

సంజామల: మహిళలు, చిన్నారులపై తప్పుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని శక్తిటీం సీఐ గౌతమి అన్నారు. మండలం పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఎస్ఐ నగీనతో కలిసి మహిళలపై జరుగుతున్న దాడులు, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. యువతీయువకులు చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళలకు ఏదైనా ఆపద వస్తే శక్తియాప్ ద్వారా సమాచారం అందిస్తే క్షణాల్లో సహాయం అందిస్తామన్నారు. బాలికలు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని.. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయే అవకాశం ఉందని తెలిపారు.


జన సందోహం మధ్య బుగ్గ వేంకటేశ్వరుని రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వరస్వామి మహారథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రథం ముందు భక్తిగీతాలు, చెక్కభజనలు, స్వామివారి వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు రథంపైకి అరటి, మామిడి పండ్లు విసురుతూ ముక్కులు చెల్లించుకున్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ రథోత్సవం కనుల పండువగా సాగింది. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


శింగనపల్లె-ఓబుళాపురం రహదారిలో వేసిన మొక్కజొన్న వ్యర్థాలు

దారి ఇలా.. వెళ్లేదెలా

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామ సమీపంలోని ఓబుళాపురం రహదారి వెంట ఉన్న పొలాల్లో ఇటీవల రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసి దిగుబడిని కోతలు కోశారు. కంకుల దిగుబడిని రహదారి వెంట ఆరబోసుకున్నారు. మొక్కజొన్న గింజలను వేరుచేసి వాటిని ఇళ్లకు తరలించుకున్నారు. అయితే గింజలను వేరుచేసుకున్నాక ఉన్న మొక్కజొన్న వ్యర్థాలను రహదారి పైనే అలాగే ఉంచేశారు. శింగనపల్లె నుంచి అవుకు మండల కేంద్రానికి రాకుండా ఓబుళాపురం మీదుగా నేరుగా తాడిపత్రి ప్రధాన రహదారికి వెళ్లొచ్చు. మొక్కజొన్న వేస్ట్ కంకులు రహదారికి అడ్డంగా ఉండడంతో రహదారి ఇలా ఉంటే వాహనాలు ఎలా వెళ్తాయని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండున్నర అడుగల ఎత్తులో ఉన్న మొక్కజొన్న వేస్ట్ కంకులు ఇలా ఉంటే రాత్రి సమయాల్లో వాహనదారుల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు చొరవ తీసుకుని రహదారి వెంట ఉన్న మొక్కజొన్న వేస్ట్‌ను తీసివేసి, రైతులు ఇలా చేయకుండా అవగాహన కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.